## ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు చిరుమర్తి



**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో నిర్వహించిన శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమం సందర్భంగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం దాతల సహకారంతో నిర్మించిన నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పాల్గొన్నవారు, ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్, సీనియర్ నాయకులు మందడి విద్యాసాగర్ రెడ్డి, ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మంటి లింగస్వామి, చిన్న పాక శ్రీనివాస్, బందెల రాములు, బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, బద్దులరమేష్ యాదవ్, పోషబోయిన మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ..

❖ *3 నెలల పాటు పోటీ పరీక్షలకు కోచింగ్*





**దశ, నకిరేకల్::** నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ అందించనున్నారు. ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే, ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ వేముల వీరేశం ఆదివారం ప్రారంభించారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఎలాంటి ఫీజు లేకుండా శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేని పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ను 2015లో ప్రారంభించామని తెలిపారు. అప్పటి నుంచి పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నకిరేకల్ పట్టణంలో ఉద్దీపన పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలో కషాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన కిట్లను పంపిణీ చేశామని, మృతుల అంత్యక్రియల్లోనూ దగ్గరుండి మానవతా సేవలు అందించామని గుర్తు చేశారు. నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, సుమారు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టడంతో పాటు నకిరేకల్ పట్టణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఉచిత శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగం పొందాలని ఆకాంక్షించారు.

నిరుద్యోగ యువతకు అండగా నిలిచి.. వారి లక్ష్య సాధనకు అవసరమైన సహకారం అందిస్తామని వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, సీనియర్ నాయకులు పూజర్ల శంభయ్య, చామల శ్రీనివాస్, నాగులవంచ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ బెల్లి యాదయ్య, ఆర్‌సీ రెడ్డి కోచింగ్ అధ్యాపకులు వేముల సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు గాదగోని కొండయ్య, టౌన్ అధ్యక్షుడు లింగాల వెంకన్న, ఉద్దీపన కోఆర్డినేటర్ చెరుకు సతీశ్,మాజీ కౌన్సిలర్లు,నాయకులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



**దశ, ఇబ్రహీంపట్నం:** నియోజకవర్గ పరిధిలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆయన మమేకమయ్యారు.



## గ్రామీణ రహదారుల అభివృద్ధికి శ్రీకారం

**దశ, ములుగు :** గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 2,145 గ్రామీణ రహదారుల అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి శుభారంభం పలికారు. ములుగు జిల్లా గట్టమ్మ ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలను మండల కేంద్రాలతో పాటు రాష్ట్రంలోని ప్రధాన రహదారులకు అనుసంధానం చేయనున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. గ్రామీణ రహదారుల అభివృద్ధికి ములుగు కేంద్రంగా తొలి అడుగు పడటంతో రాష్ట్రంలోని పల్లె ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కళా రత్న సినిమా అవార్డ్స్ 2026 అవార్డు అందుకున్న లోకిని రాజు




**దశ, ఓయూ:** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వందే భారత్ సేవ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సినిమా ప్రదర్శన జాతీయ సమైక్యతా అవార్డ్స్-2026 కార్యక్రమం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సినిమా, కళా, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులకు కళా రత్న సినిమాలు అవార్డ్స్-2026 అందజేశారు.అందులో భాగంగా తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు విశిష్ట సేవలను గుర్తించిన గౌరవ అతిధులు ఫిలిం డైరెక్టర్ రేలంగి, సుద్దాల అశోక తేజ,రామరాజు, ఎం రమేష్ చేతుల మీద మహోన్నత సత్కారంతో ఘనంగా సన్మానించి అవార్డును అందుకున్నారు. అనంతరం లోకిని రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసి గిరిజనుల భాష, సంస్కృతి సాంప్రదాయాలు కోసం వారి హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం అనేక కార్యక్రమాలు చేస్తూ ఆదివాసి సమాజాన్ని చైతన్యపరిచే విధంగా ఎన్నో పోరాటాలు చేశానని తెలిపారు. చేసిన సేవలను గుర్తించి నాకు అవార్డుతో సత్కరించడం తనలో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం, సమైక్యత, ఆదివాసీ ఎరుకల ప్రజల అభ్యున్నతి కోసం మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్కరించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, సినీ ప్రముఖులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పీఏసీ సమీక్షా సమావేశంలో సచిన్ సావంత్



**దశ, హుజురాబాద్:** కరీంనగర్ పట్టణంలోని డీసిసి కార్యాలయంలో తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జి సెక్రటరీ సచిన్ సావంత్,జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా పీఏసీ సభ్యులతో కలిసి పొలిటికల్ అఫ్ఫైర్స్ కమిటీ సమావేశంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,జిల్లా మహిళా అధ్యక్షురాలు,మాజీ శాసన సభ్యులు పాల్గొన్నారు.అనంతరం ఏడుఅంశాలపైజరిగిన ఈసమావేశంలోనాయకులుసుదీర్ఘంగా చర్చించారు.రాజకీయంగా కాంగ్రెస్ పార్టీనీ క్షేత్ర స్థాయిలో ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి,ఎస్ఐఆర్,సంక్షేమ పథకాలు వంటి వాటిపై చర్చించారు.

## రహేజా విస్తాస్ అపార్ట్మెంట్‌లో ఘనంగా బోనాల పండుగ



**దశ ఓయూ:** నాచారం రహేజా విస్తాస్ అపార్ట్మెంట్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రహేజా విస్తాస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన శ్రీనివాస్, మహిళా సభ్యురాలు గిరిజ నాయుడు, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, శ్రీనివాస్ శర్మ, పుప్పాల వెంకటేష్, గందమల గోపి, అజయ్ కుమార్ తదితర అసోసియేషన్ సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రచారం కాదు.. ప్రతి ఇంటికీ ఓ లేఖ..

❖ **ప్లాస్టిక్‌పై వార్డు సభ్యుడి వినూత్న పోరాటం**



**దశ, చౌటుప్పల్:** ప్లాస్టిక్.. చేతిలో పట్టుకుంటే చిన్న వస్తువే. కానీ పర్యావరణంపై మాత్రం దాని ప్రభావం చాలా పెద్దది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా.. ప్రజల్లో ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ వార్డు సభ్యుడు పాతం వెంకటేష్ వినూత్నంగా ఆలోచించారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయలేదు.. మైకులు పెట్టలేదు.. సోషల్ మీడియాలో ప్రచారం చేయలేదు. బదులుగా ప్రతి కుటుంబానికి స్వయంగా ఓ లేఖ రాసి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అంకిరెడ్డిగూడెంను అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో వెంకటేష్ పనిచేస్తున్నారు.

ముఖ్యంగా గ్రామాన్ని పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే సాధారణ ప్రచార పద్ధతులకు భిన్నంగా ప్రజలతో నేరుగా మాట్లాడేలా ఓ లేఖ రాయాలని నిర్ణయించుకున్నారు. 'పరిశుభ్రమైన అంకిరెడ్డిగూడెం కోసం ఒక చిన్న మనవి' అంటూ ప్రత్యేకంగా లేఖలు రూపొందించి పోస్టల్ శాఖ ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికీ పంపించారు. గ్రామంలోని 320 ఇళ్లకు తన సొంత ఖర్చులతో లేఖలు పంపించారు.

'మన ఇంటి నుంచే మార్పు మొదలైతేనే.. మన గ్రామం మారుతుంది' అనే సందేశంతో ప్రతి కుటుంబాన్ని ఆలోచింపజేసే ప్రయత్నం చేశారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా బట్ట సంచులను ఉపయోగించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని గ్రామస్తులను కోరారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించడంతో పాటు.. రాబోయే తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్తుచేశారు. ప్రచారం కోసం వేల రూపాయలు ఖర్చు చేయడం కంటే.. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి తన సొంత డబ్బుతో లేఖలు పంపించడం తన ఉద్దేశమని వెంకటేష్ చెబుతున్నారు. ఒక చిన్న లేఖ అయినా ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వినియోగంపై చర్చ మొదలవుతుందని ఆయన ఆశిస్తున్నారు. ఒక్క కుటుంబం బట్ట సంచిని ఉపయోగించడం మొదలుపెట్టినా.. మరో కుటుంబం చెత్తను రోడ్డుపై వేయకుండా డస్ట్‌బిన్‌లో వేయడం అలవాటు చేసుకున్నా.. అది గ్రామానికి ఉపయోగపడే మార్పేనని అంటున్నారు.

అంకిరెడ్డిగూడెంలో మొదలైన ఈ చిన్న ప్రయత్నం ఇప్పుడు స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. పర్యావరణ పరిరక్షణకు పెద్ద పెద్ద ప్రచార కార్యక్రమాలే అవసరం లేదని..ప్రతి ఇంటికి చేరే ఓ చిన్న సందేశం కూడా మార్పుకు నాంది పలకగలదని వెంకటేష్ ప్రయత్నం చెబుతోంది. ప్లాస్టిక్ సంచికి బదులుగా ఓ బట్ట సంచి.. చెత్తను రోడ్డుపై వేయకుండా ఓ డస్ట్‌బిన్.. ఈ చిన్న మార్పులే మన ఊరిని, మన పరిసరాలను, మన భవిష్యత్‌ను కాపాడగలవు.

## సీతాఫల్మండి రవీంద్రనగర్‌లో ఘనంగా బోనాల పండుగ




**దశ, ఓయూ:** సీతాఫల్మండి డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు గండికోట కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గండికోట కుమార్ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## నాచారం ఎర్రకుంటలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**దశ, ఓయూ:** ఎర్రకుంటలోని శ్రీ శ్రీ మాతా నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు బోనమెత్తుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేశాపాక నర్సింగ్‌రావు, దేశాపాక బిక్షపతి, జంగం అశోక్, వాసుదేవరావు, కొమ్మట ఆశన్న, శ్రీమూర్తి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చెంగిచెర్లలో ఘనంగా పోచమ్మ బోనాలు



**దశ, ఓయూ:** శ్రీ పోచమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 50 ఏళ్లుగా ప్రతి ఏడాది పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో సందడి నెలకొంది.

## ప్రణవ్‌ను ఆత్మీయంగా పలకరించిన సీఎం రేవంత్ రెడ్డి



**దశ, హుజురాబాద్:** పరకాలలో జరిగిన బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రణవ్‌ను ఆత్మీయంగా పలకరిస్తూ.. "ప్రణవ్.. బాగున్నావా?" అని అడిగి, ఆయన చేస్తున్న పనితీరును అభినందించారు. "బాగా పనిచేస్తున్నావ్.. ఇదే పంథాను కొనసాగించాలి" అని ప్రణవ్‌కు సీఎం సూచించారు. ముఖ్యమంత్రి తనను ఆత్మీయంగా పలకరించి, పనితీరును ప్రశంసించడంతో ప్రణవ్ ఆనందం వ్యక్తం చేశారు.

## వైభవంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన



**దశ, హైదరాబాద్:** బెజ్జూర్ మండలంలోని ఎలుకపెల్లి, బెజ్జూర్ గ్రామాల సమీపంలోని నాగుల చెరువు వద్ద నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్‌కు చెందిన అర్చకులు పూసాల సాయిరాం శాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి గ్రామాల నుంచి భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై నాగదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగనాయక స్వామి ఆలయ అధ్యక్షుడు తంగేడి పల్లి మహేష్, బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పంద్రం పుష్పలత తదితరులతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు...

- ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ ఘాటు హెచ్చరిక..
- 20 ఏళ్ల పోరాట ఫలితాన్ని లాక్కోవాలని చూస్తే ఉద్యమం ఉధృతం



**దశ, హుజురాబాద్:** జర్నలిస్టుల రెండు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాలతో దక్కించుకున్న ఇళ్ల స్థలాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అక్రమ కుట్రలను సహించే ప్రసక్తే లేదని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గూడూరు స్వామిరెడ్డి పెట్టిన వివాదాస్పద కేసుపై రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆయనతో మాట్లాడి కేసును బేషరతుగా ఉపసంహరింపజేయాలని ఆయన అల్టిమేటం జారీ చేశారు.

టీయు డబ్ల్యూజే (ఐజేయూ) హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వేదికగా జర్నలిస్టులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షా శిబిరానికి టీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన నగునూరి శేఖర్ దీక్షాపరులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి దాదాపు 20 ఏళ్లుగా అలుపెరగని ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఎన్నో ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం నుంచి చట్టబద్ధంగా ఇళ్ల స్థలాలను సాధించుకుంటే, స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కక్షపూరితంగా అడ్డుపడుతూ న్యాయపరమైన చిక్కులు సృష్టించడం దుర్మార్గమని మండిపడ్డారు. శ్రమజీవులైన మీడియా ప్రతినిధులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఇలాంటి వ్యక్తి వైఖరిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, బాధ్యతాయుతమైన మంత్రులు తక్షణమే రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం వహించి, ఈ అక్రమ కేసును ఎత్తివేయించేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టుల ఆగ్రహ జ్వాలలు రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతాయని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాల వివాదంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని, సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామిని రవీందర్ లు ధ్వజమెత్తారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై కాంగ్రెస్ అధిష్ఠానం తన స్పష్టమైన వైఖరిని తేల్చి చెప్పే వరకు, ఇళ్ల స్థలాల సమస్య కొలిక్కి వచ్చేంతవరకు హుజురాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని రకాల వార్తలు, ప్రెస్ మీట్లు, అధికారిక కార్యక్రమాలను సంపూర్ణంగా బహిష్కరిస్తున్నట్లు వారు తీవ్ర స్వరంతో ప్రకటించారు.


ఈ నిరసన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు కేదాసి శ్రీధర్, నిమ్మటూరి సాయికృష్ణ, సమ్మెట సతీష్, బొడ్డు శ్రీనివాస్, మచ్చిక చందు, టేకుల సాగర్, పోతరాజు సంపత్, బండి సాయికృష్ణ, నాగవెల్లి రాజు, బొడ్డు శ్రీనివాస్, భారత రజనీకాంత్ లు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ గౌడ్,మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ సామాజికవేత్త సబ్బానీ వెంకట్,బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్,వెంకటేష్, దేవసాని ప్రియదర్శిని,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మాదుగుల ఓదెలు, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. స్వామిరెడ్డి వైఖరి నశించాలి" అంటూ నినదిస్తూ అంబేద్కర్ చౌరస్తా పరిసరాలను హోరెత్తించారు. కళాకారుల ఆటపాట పలువురిని ఆకట్టుకున్నాయి.



## 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**దశ, హైదరాబాద్ :** అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గూడూరు పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు లక్ష్మీపురం గ్రామంలోని సిద్ధి వినాయక రైస్ మిల్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం బయటపడింది. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కొర్ర వెంకన్న (చిర్రకుంట తండ)ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.విచారణలో పొనుగోడు గ్రామానికి చెందిన మేడి మల్లేశం పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. సిద్ధి వినాయక రైస్ మిల్‌కు బియ్యాన్ని అప్పగించేందుకు తీసుకొచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉందా? బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? ఇప్పటివరకు ఎంత మొత్తంలో బియ్యాన్ని తరలించారు? అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనానికి సంబంధించిన వివరాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

## ఇఫ్లూ ఘర్షణల్లో చట్టప్రకారమే చర్యలు: ఓయూ ఏసీపీ జగన్




**దశ ఓయూ:** ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణలపై పోలీసులు చట్టప్రకారమే చర్యలు తీసుకున్నారని ఓయూ ఏసీపీ జగన్ స్పష్టం చేశారు. ఆదివారం ఓయూ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రెండు రోజుల క్రితం ఇద్దరు విద్యార్థినులకు గదుల కేటాయింపు అంశంపై ఇఫ్లూ అధికారులతో విద్యార్థి సంఘాల ప్రతినిధులు చర్చించారని తెలిపారు. అనంతరం కొందరు విద్యార్థులు ధర్నాకు దిగడంతో మరో విద్యార్థి సంఘం ప్రతినిధులతో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుందని చెప్పారు. ఈ ఘటనపై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందడంతో పోలీసులు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున 3.50 నిమిషాల నుంచి 4 గంటల మధ్య కొందరు విద్యార్థులు ప్రత్యర్థి వర్గానికి చెందిన మూడు గదుల్లోకి చొరబడి కర్రలు, రాళ్లతో దాడి చేసినట్లు ఏసీపీ తెలిపారు. దీంతో బాధితులు కూడా ఎదురుదాడికి దిగారని, ఘటనలో ఇద్దరు విద్యార్థులకు తలకు తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు.

ఇరువర్గాలపై 147, 148, 149 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తీవ్ర గాయాలకు కారణమైన వారిపై బీఎన్‌ఎస్ 326 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, తీవ్ర గాయాల కేసులో ఏడుగురు విద్యార్థులకు బెయిల్ నిరాకరించి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. విద్యార్థులను జైలుకు పంపాలనే నిర్ణయం పోలీసులది కాదని, మేజిస్ట్రేట్‌దేనని ఏసీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఓయూ సీఐ వి. దాసు, ఎస్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకి సుఖసంతోషాలు కలగాలి





**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో సూర్యాపేట ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు ముత్యాలమ్మ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25వ వార్డులో కృష్ణ టాకీస్ సమీపంలోని శ్రీ ఊర ముత్యాలమ్మ దేవాలయం, 48వ వార్డులోని కోట మైసమ్మ దేవాలయం, 16వ వార్డులోని బేచిరాగ్ మదారం శ్రీ ముత్యాలమ్మ దేవాలయం, 1వ వార్డులోని ముత్యాలమ్మ తల్లి దేవాలయం, 2వ వార్డులోని ముత్యాలమ్మ తల్లి దేవాలయాలను వారు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

